క్లుప్తంగా

సూచిక బోర్డుల ఏర్పాటు



డివైడర్ ప్రారంభ దశలో సూచిక బోర్డు ఏర్పాటు

శివ్వంపేట (నర్సాపూర్): తూప్రాన్–నర్సాపూర్ ప్రధాన హైవే పై 'కనిపించని సూచిక బోర్డులు' కథనం సాక్షి దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన విషయం తెలిసిందే. అందుకు గాను సంబంధిత హైవే సిబ్బంది స్పందించారు. ప్రమాదభరితంగా ఉన్న పలు ప్రాంతాల్లో సూచిక బోర్డులు ఏర్పాటుతో పాటు పలుచోట్ల రోడ్డుపై ఏర్పడిన గుంతల పూడ్చివేశారు. శివ్వంపేటలోని డివైడర్ ప్రారంభ దశలో సూచిక బోర్డులు మంగళవారం ఏర్పాటు చేసినప్పటికి డిప్పర్ లైట్లు పెట్టాల్సిన అవసరం ఉంది.

సమాచారం తెలుసుకునే హక్కు ఉంది

అల్లాదుర్గం(మెదక్): సమాచారం తెలుసుకునే హక్కు ప్రతి ఒక్కరికి ఉందని తహసీల్దార్ మల్లయ్య అన్నారు. సమాచార హక్కు చట్టం వారోత్సవాలను తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. సమాచార హక్కు చట్టం వినియోగించుకుని సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేసిన బ్రహ్మంను శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ప్రభుత్వ కార్యాలయాలలో ప్రజలకు అవసరమైన సమాచారం తీసుకునే హక్కు ఉందన్నారు.

పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండవ రోజు ఆలయ ఆవరణలో మంగళవారం చండీహోమాన్ని వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య ఘనంగా నిర్వహించారు. బుధవారం విగ్రహ ప్రతిష్ఠ, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

రోడ్డు భద్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

సంగారెడ్డి : సంగారెడ్డి పరిధి విద్యానగర్‌లోని సెయింట్ ఆంథోనీస్ పాఠశాల విద్యార్థులు మంగళవారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు భద్రత నియమాలు, హెల్మెట్ ధరించడం ప్రాముఖ్యతను విద్యార్థులు బుర్రకథ రూపంలో వాహనదారులకు వివరించారు. అతివేగం, ట్రాఫిక్ నియమాలు పాటించకపోవడం, హెల్మెట్ ధరించకపోవడం వల్ల చాలా మంది రోడ్డు ప్రమాదాలకు గురై మరణిస్తున్నారన్నారు. హెల్మెట్ ధరించే వాళ్లను విద్యార్థులు అభినందించారు. కార్యక్రమంలో పోలీసులు, పాఠశాల చైర్మన్ ఆంథోనీ రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రమీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుసుమ రైతుల గుర్తింపునకు శిబిరాలు



కమిషనర్‌కు పత్రాలు అందజేస్తున్న ఆర్‌పి

నారాయణఖేడ్: మండలంలో కుసుమ పంటను సాగు చేస్తున్న రైతులను గుర్తించడం కోసం ప్రత్యేక శిబిరాలను నిర్వహించినట్లు నేషనల్ మిషన్ ఆఫ్ ఎడిబుల్ ఆయిల్ సీడ్స్ డీపీఎం సుధాకర్, అరుణశ్రీలు తెలిపారు. కార్యక్రమంలో సెర్ప్ ఏపీఎం శిరీష, వ్యవసాయాధికారిణి అరుణశ్రీ, శివకుమార్, రామారావు, ఇక్రిశాట్ అధికారి వేణుగోపాల్, స్థానిక ఏపీఎం సాయిలు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని వినతి

సంగారెడ్డి జోన్: కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు తమ ఇళ్లు, ప్లాట్లను ధ్వంసం చేస్తున్నారని, తమకు న్యాయం చేయాలని మంగళవారం జిల్లా రెవెన్యూ అధికారిణి పద్మజారాణికి ఐడీఎస్ఎంటీ కాలనీ వాసులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జహీరాబాద్ పట్టణంలో ఇల్లు, ప్లాట్లు లేని వారికి 1982 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం ప్లాట్లు ఇచ్చింది. కొంతమంది ఇళ్లను నిర్మించుకోగా మరి కొందరు అలాగే ఉంచారు. ప్రైవేట్ వ్యక్తులు జేసీబీలతో ఇళ్లు, ప్లాట్లను ధ్వంసం చేస్తున్నారని వాపోయారు. 25 సంవత్సరాల నుంచి ఇక్కడ నివసిస్తున్నామన్నారు. స్థానిక అధికారులు పట్టించుకోవడంలేదని, తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. బీఆర్ఎస్ నాయకులు నామ రవికిరణ్, వెంకటేశం, నర్సింహ్మారెడ్డి, వెంకట్ సాగర్ ఉన్నారు.

అవినీతి అధికారులపై వేటు

ఏళ్లుగా ఒకేచోట పాతుకుపోయిన అధికారులకు స్థానచలనం

- త్వరలో జారీ కానున్న బదిలీల ఉత్తర్వులు!
- చెరువుల ఆక్రమణదారులతో చెట్టపట్టాల్
- వందల చెరువుల అన్యాక్రాంతానికి పరోక్ష సహకారం
- కోట్లలో అక్రమాస్తులు కూడగట్టిన ఇంజనీరింగ్ అధికారులు



సంగారెడ్డిలోని నీటిపారుదల శాఖ కార్యాలయం

సంగారెడ్డి ప్రాంతంలో సుమారు తొమ్మిదేళ్లుగా ఒకే చోట పాతుకుపోయిన ఓ ఇంజనీరింగ్ ఉన్నతాధికారి చెరువుల కబ్జాదారులతో చేతులు కలిపారు. కంచే చేను మేసిన చందంగా చెరువులను కాపాడాల్సిన ఈ అధికారి వీటిని కబ్జా చేస్తూ వేసిన రియల్ ఎస్టేట్ వెంచర్లకు అనుకూలంగా వ్యవహరించారు. చెరువుల్లోంచి మట్టిని అక్రమ రవాణాదారుల నుంచి పెద్ద మొత్తంలో దండుకున్నారు. పైగా చెరువులను ఆక్రమించినట్లు ఫిర్యాదులు అందితే చాలు.. పెద్ద మొత్తంలో దండుకోవడం, ఆక్రమణదారులకు అనుకూలంగా నివేదికలు ఇవ్వడంలో సదరు అధికారి ఆరితేరారు. రూ.కోట్లలో అక్రమార్జనకు పాల్పడిన ఈ అధికారిపై ఇప్పుడు బదిలీ వేటు వేయాలని ఆశాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు.

పటాన్‌చెరు ప్రాంతంలో సుమారు నాలుగున్నరేళ్లకు పైగా ఒకే చోట పనిచేస్తున్న మరో ఇంజనీరింగ్ అధికారి చెరువుల కబ్జా రాయుళ్లతో చెట్టపట్టాలేసుకున్నాడు. సుమారు నాలుగు వందలకు పైగా చెరువులు, కుంటలు, నాలాలు, ఇతర వాటర్‌బాడీలకు ఎన్‌ఓసీలు జారీ చేసి రూ.వందల కోట్లు వెనకేసుకున్నట్లు ఆశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. పైగా చెరువులను కబ్జా చేసే అక్రమణదారులతో చేతులు కలిపి పదుల సంఖ్యలో చెరువులు అన్యాక్రాంతం అయ్యేందుకు పరోక్షంగా సహకరించాడు. తాజాగా చేపట్టిన బదిలీల్లో ఈ అధికారికి స్థానచలనం కల్పించాలని ఆశాఖ ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: నీటి పారుదల శాఖ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం అవినీతి ఆరోపణ ఎదుర్కొంటున్న ఇంజనీరింగ్ అధికారులపై వేటు వేసేందుకు రంగం సిద్ధమైంది. ఏళ్ల తరబడి ఒకేచోట పాతుకు పోయి పెద్ద మొత్తంలో అక్రమార్జనకు పాల్పడిన ఈ అధికారులకు స్థానచలనం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాలో ఈ శాఖ ఇంజనీరింగ్ అధికారులకు మూకుమ్మడి బదిలీలు జరగనున్నాయి. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో పనిచేసి అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇంజనీరింగ్ అధికారులకు ఏమాత్రం తీసిపోని స్థాయిల్లో జిల్లాలోని కొందరు ఇంజనీరింగ్ అధికారులు పెద్ద మొత్తంలో అక్రమార్జనకు పాల్పడ్డారు. ఇలాంటి అధికారులపై దృష్టి సారించిన ఆశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు ఈ మేరకు ప్రక్షాళన చేయాలని నిర్ణయించారు.

సంగారెడ్డి కోసమే ప్రత్యేక బదిలీలు

రాష్ట్రవ్యాప్తంగా 106 మంది ఇంజనీరింగ్ అధికారులను బదిలీలు చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా ఉమ్మడి మెదక్ జిల్లాలో ఐదుగురు డీఈలకు, 11 మంది ఏఈఈలకు స్థానచలనం కలిగింది. అయితే ఈ బదిలీలతో సంబంధం లేకుండా సంగారెడ్డి జిల్లా కోసం ప్రత్యేకంగా బదిలీ ప్రక్రియను చేపట్టాలని నిర్ణయించినట్లు ఆశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నిర్ణయం వందల కోట్లు అక్రమార్జనకు మరిగిన ఈశాఖ అధికారులకు ఏమాత్రం మింగుడు పడటం లేదు. ఈ బదిలీల విషయం ముందే పసిగట్టిన ఈ అక్రమార్కులు మళ్లీ మంచి పోస్టింగ్‌ల కోసం అధికార కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులను ఆశ్రయిస్తుండటం గమనార్హం.

మూడేళ్లకొకసారి బదిలీ ఎక్కడ?

నిబంధనల ప్రకారం ప్రతీ మూడేళ్లకొకసారి బదిలీలు చేయాల్సి ఉంటుంది. అయితే రాజకీయ నేతల పంచన చేరుతున్న కొందరు అధికారులు ఏకంగా తొమ్మిదేళ్లుగా ఒకేచోట కదలకుండా ఉన్నారంటే ఈ అధికారులు ఏ స్థాయిలో అక్రమార్జన కూడగట్టారనేది ఇట్టే అర్థం చేసుకోవచ్చు. జిల్లాలో ఈశాఖలో ఒక చీఫ్ ఇంజనీర్, ఆరుగురు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, 24 డీఈ పోస్టులున్నాయి. అలాగే సుమారు 80కిపైగా ఏఈలు, ఏఈఈలు పనిచేస్తున్నారు. ఖాళీలు పోగా సుమారు 120మందికి పైడా ఇంజనీరింగ్, టెక్నికల్ పోస్టుల్లో పనిచేస్తున్నారు. ఇందులో కొందరు దశాబ్ద కాలంగా ఒకే చోట పని చేస్తున్న అధికారులున్నారంటే ఏ స్థాయిలో వీరి ఆగడాలు సాగుతున్నాయో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

అసంపూర్తిగా ఎస్టీ కమ్యూనిటీ హాల్

నర్సాపూర్: గిరిజనులకు ఉపయోగకరంగా ఉంటుందన్న ఉద్దేశంతో నిర్మించ తలపెట్టిన గిరిజన కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. నర్సాపూర్ నియోజకవర్గంలో గిరిజన జనాభా ఎక్కువగా ఉంటుంది. పట్టణంలో సైతం గిరిజన కుటుంబాలు స్థిరపడ్డాయి. నాలుగేళ్ల క్రితం ప్రభుత్వం గిరిజన కమ్యూనిటీ హాల్ మంజూరు చేసి.. పనులు ప్రారంభించారు. నిధులు రానందున మధ్యలోనే నిర్మాణ పనులు ఆగిపోయాయి.

ఆలయాల పక్కన నిర్మాణం

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.50లక్షలు మంజూరు చేసింది. టెండర్ల అనంతరం నర్సాపూర్ హైదరాబాద్ జాతీయ రహదారిపై పట్టణ సబ్‌స్టేషన్ పక్కన గిరిజనుల ఆరాధ్య దైవం నిర్మాణంలో ఉన్న భవానిమాత, సంత్ శ్రీసేవాలాల్ మహరాజ్ ఆలయాల పక్కన గిరిజన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు చేసిన వరకు కాంట్రాక్టరుకు బిల్లులు రాకపోవడంతో పనులు నిలిపేశారు.



అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్

ఉపయోగకరంగా ఉంటుందని

గిరిజన కమ్యూనిటీ హాల్ పూర్తయితే ఫంక్షన్‌లు, తాము సామూహికంగా చేపట్టే కార్యక్రమాలు నిర్వహించేందుకు అనుకూలంగా ఉంటుందని భావించామని బంజారా ఎంప్లాయిస్ సేవ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సామ్యానాయక్, రాంచందర్ నాయక్ చెప్పారు. ప్రభుత్వం బిల్లులు విడుదల చేయనందున కమ్యూనిటీ హాల్ అసంపూర్తిగా ఉందని విచారం వ్యక్తం చేశారు. పాత బిల్లులు విడుదల చేసి నిర్మాణ పనులు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

నిర్ణీత ధరలే వసూలు చేయాలి

మీ సేవ నిర్వాహకులకు తహసీల్దార్ సూచన

చేగుంట(తూప్రాన్): ఈసేవ కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన దర కంటే ఎక్కువ డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ శివప్రసాద్ తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో మీసేవ ఇంటర్నెట్ సెంటర్ల నిర్వాహకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మీసేవ కార్యాలయాల్లో కల్యాణలక్ష్మి, ఇతర ధ్రువీకరణ పత్రాల నమోదుకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలే తీసుకోవాలని కోరారు. భూభారతి, కల్యాణలక్ష్మి విషయాల్లో ఇంటర్నెట్ సెంటర్లు దళారులుగా వ్యవహరిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

చెక్కుల అందజేత

నర్సాపూర్: తన నివాసంలో మంగళవారం పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే సునీతారెడ్డి అందజేశారు. ఆమె వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ అశోక్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు సత్యంగౌడ్, జీవన్‌రెడ్డి, విఠల్, రఘువీర్ తదితరులు ఉన్నారు.

నేడు ఎమ్మార్పీఎస్ సమావేశం

మనోహరబాద్(తూప్రాన్): జిల్లా కేంద్రమైన మెదక్‌లో నిర్వహించే మంద కృష్ణమాదిగ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి సుధాకర్ కోరారు. గురువారం ఎంఆర్పీఎస్ జిల్లా సమావేశానికి మంద కృష్ణ హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి అన్ని మండలాల ఎంఆర్పీస్ కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

కల్లాలకు చేరిన ధాన్యం



కల్లాల వద్దకు చేర్చిన వరిధాన్యం

- 4,599 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం
- వర్షాలతో భారీగా తగ్గిన దిగుబడి

కొల్చారం(నర్సాపూర్): పంట ఎదుగుదల మొదలుకొని, కోతకొచ్చే వరకు కురిసిన భారీ వర్షాలు రైతులను ఉక్కిరిబిక్కిరి చేసినప్పటికీ నెమ్మదిగా వర్షాలు తగ్గుముఖం పట్టడంతో రైతులు వరి కోతలపై దృష్టి సారించారు. పంట కోతకు హార్వెస్టర్లను ఉపయోగిస్తున్నారు. దీంతో కోతలు ఊపందుకున్నాయి.

కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

మండలంలో ఈసారి వానాకాలం పంట కింద 20,100 ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. సన్నరకం 11,230 ఎకరాలు, దొడ్డు రకం 8870 ఎకరాల్లో సాగు చేశారు. వరి కోతలు ప్రారంభం కావడంతో ఐకేపీ, ఎపీఎఫ్ఓ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే కొన్ని ప్రారంభించారు. రైతుల నుంచి 4599.6 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఏఓ శ్వేతా కుమారి తెలిపారు. ఇందులో సన్నారకం 2470.6 మెట్రిక్ టన్నులు, దొడ్డు రకం 2128 మెట్రిక్ టన్నులుగా పేర్కొన్నారు.



వరి పంటను కోస్తున్న హార్వెస్టర్

భారీగా తగ్గిన దిగుబడి

ఈసారి వరి పంట గింజ పాలు పోసి, గట్టిపడే దశలో వివిధ రకాల తెగుళ్ల పంటను ఆశించడంతో పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. కొన్నిచోట్ల పంట చేతికి రాని పరిస్థితి నెలకొనగా, మరోవైపు మంజీరా నదికి పెద్ద ఎత్తున నెలరోజులకు పైగా వరదరావడంతో పరివాహక ప్రాంతంలోని వరిపంట వందల ఎకరాల్లో పంట నీట మునిగి పూర్తిగా దెబ్బతింది. ఇటు వర్షాలు, అటు తెగుళ్లు, మరో వైపు వరదలతో పంట దిగుబడి సరిగ్గా రాక రైతులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. పంట కొనుగోలు సమయంలో ఎలాంటి ఆంక్షలు పెట్టకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

పెట్టుబడి వస్తుందన్న నమ్మకం లేదు

ఈసారి భారీ వర్షాలకు తోడు దోమపోటు, సుడిదోమ, మోగి పురుగు పంటను ఆశించడంతో పంట దెబ్బతినింది. గింజ తొడగక సగానికి సగం పంట ఎండిపోగా మిగిలింది పొల్లుపొల్లు పోయింది. రోగాల నుంచి పంటను రక్షించుకునేందుకు వేలల్లో ఖర్చు పెటాల్సిన పరిస్థితి నెలకొంది. పంటకు పెట్టిన పెట్టిబడి కూడా వచ్చే పరిస్థితి కానరావడం లేదు.

– వాసుదేవ్ గౌడ్, వరిగుంతం

రైతులను ఆదుకోవాలి

భారీ వర్షాలకు వంటను పూర్తిగా దెబ్బతిన్నాయి. దీనికి తోడు తెగుళ్లు కూడా ఆశించడంతో దిక్కు తోచని పరిస్థితి నెలకొంది. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించి సన్న రకానికి ఇస్తున్న బోనస్‌ను మరింత పెంచి రైతులను ఆదుకోవాలి.

– దుర్గయ్య, సదాశివనగరం

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



అక్షిత



నర్సింలు

పాపన్నపేట(మెదక్): పాపన్నపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు అండర్ 17, అండర్ 14 విభాగంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పీడీ రమేష్ తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న అక్షిత, 9వ తరగతి చదువుతున్న నర్సింలు ఈ నెల 13న పటాన్‌చెరువులో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలో విజయం సాధించి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. తమ విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల ప్రధానోపాధ్యాయుడు మహేశ్వర్, టీచర్లు సంతోషం వ్యక్తం చేశారు.

కొడిపల్లిలో



పూజ

కొడిపల్లి(నర్సాపూర్): రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు మండలంలోని భుజిరంపేట ఉన్నత పాఠశాల విద్యార్థిని పూజ ఎంపికైనట్లు పీడీ శేఖర్ మంగళవారం తెలిపారు. పటాన్‌చెరువులో జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలలో అండర్ 17 విభాగంలో కొడిపల్లి మండలం భుజిరంపేట ఉన్నత పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థిని పూజ పాల్గొని ప్రతిభ కనబరిచింది. దీంతో ఉమ్మడి జిల్లా తరఫున రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు చెప్పారు. త్వరలో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రాష్ట్ర స్థాయి పోటీలలో పూజ పాల్గొననున్నట్లు పీడీ తెలిపారు. భుజిరంపేట విద్యార్థిని రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంతో ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

రామాయంపేటలో..



రచన

రామాయంపేట(మెదక్): మండలంలోని రాయిలాపూర్ జడ్పీ స్కూలులో ఏడో తరగతి చదువుతున్న రచన ఎస్‌జీఎఫ్ఐ కబడ్డీలో ప్రతిభ కనబర్చి 14 ఏళ్లలోపు విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు మంగళవారం రచనను పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయ విమల తదితరులు పాల్గొన్నారు.

చందాయిపేట విద్యార్థిని ఎంపిక



స్వాతి

చేగుంట(తూప్రాన్): రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు చందాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని స్వాతి ఎంపికైనట్లు పీఈటీ శంకర్ తెలిపారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువులో స్కూల్‌గేమ్ ఫెడరేషన్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో చందాయిపేట పాఠశాలకు చెందిన తావత్ స్వాతి పాల్గొని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. స్వాతి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల ప్రధానోపాధ్యాయులు కిషన్ ఉపాధ్యాయులు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేసారు.

మాకు రిజర్వేషన్లు కల్పించండి

అదనపు కలెక్టర్‌కు రాజ్‌పల్లి దళితుల వినతి

మెదక్ కలెక్టరేట్: స్థానిక సంస్థల ఎన్నికల్లో తమకు రిజర్వేషన్లు కల్పించాలని మెదక్ మండలం రాజ్‌పల్లి గ్రామ దళితులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ నగేష్‌కు దళితులు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 70 యేళ్ల గడిచిపోతున్నా ఇప్పటి వరకు రాజ్‌పల్లి గ్రామంలో ఎస్సీలకు రిజర్వేషన్ రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో 450 ఎస్సీ జనాభా ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో



అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న రాజ్‌పల్లి దళితులు

సొసైటీ డైరెక్టర్ విజయ్, పద్మయ్య, ప్రశాంత్, రమేష్, దశరథ్, నర్సింలు, మహేందర్, సురేష్, బాలయ్య, సామెల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి



- ఎన్ఏఏఆర్ఎం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ తంబిరాజు
- తునికిలో కేవీకే ఆధ్వర్యంలో రైతులకు అవగాహన

కొడిపల్లి(నర్సాపూర్): వరిపంటకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగుచేయడం వల్ల రైతులు అధిక ఆదాయం పొందవచ్చని హైదరాబాద్ ఎన్ఏఏఆర్ఎం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ తంబిరాజు తెలిపారు. మంగళవారం మండలంలోని తునికి కేవీకే ఆధ్వర్యంలో తునికి గ్రామంలో అగ్రికల్చర్ సర్వీసెస్ యువ శాస్త్రవేత్తలు శిక్షణ కార్యక్రమం సందర్భంగా రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఎన్ఏఏఆర్ఎం (నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రిసర్చ్ మేనేజ్‌మెంట్) ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ తంబిరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. రైతులు కేవలం వరి సాగు వైపు మొగ్గ చూపుతున్నారని, ప్రత్యామ్నాయంగా కూరగాయల సాగు, డెయిరీ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతిరోజు ఆదాయం వస్తుందన్నారు. పంట మార్పిడి జరగడంతోపాటు పశువుల ఎరువు అభిస్తుందని చెప్పారు. రైతులు ఎప్పటికప్పుడు ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించాలని కోరారు. అనంతరం కేవీకే హెడ్ అండ్ సైంటిస్ట్ డాక్టర్ శంభాజీ దత్తాత్రేయ నల్కర్ మాట్లాడుతూ రైతులు సేంద్రియ, ప్రకృతిసాగు చేయాలని చెప్పారు. సేంద్రియ సాగుతో నాణ్యమైన ఆహార ఉత్పత్తులు పండుతాయని ఆరోగ్యం బాగుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సురేష్, కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రవికుమార్, డాక్టర్ సురేష్, యువశాస్త్రవేత్తలు సందీప్, రణబీర్, రవిప్రకాష్, గోపాలకృష్ణ, రుచిత, లావణ్య, గ్రామ రైతులు పాల్గొన్నారు.

తునికి రైతులతో శాస్త్రవేత్తలు

ప్రాణాలతో చెలగాటం



మెదక్ జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న బాణసంచా దుకాణాలు

ఇష్టానుసారంగా బాణసంచా దుకాణాలు

- ప్రమాణాలు పాటించని నిర్వాహకులు
- ప్రమాదం జరిగిందంటే ప్రాణాలు హరీ
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న పలు విభాగాల అధికారులు

మెదక్‌జోన్: బాణసంచా దుకాణాల నిర్వాహకులు ఇష్టానుసారంగా ఏర్పాటు చేస్తూ ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కనీస నిబంధనలు పాటించకుండా దుకాణాల ఏర్పాటు చేస్తుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు ఇవ్వాల్సిన పలుశాఖల అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.


నాలుగు విభాగాల అనుమతులు తప్పనిసరి

మెదక్ జిల్లాలో ప్రతీఏటా దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా 200 నుంచి 250 దుకాణాలు ఏర్పాటు చేస్తుంటారు. ఇందులో ప్రధానంగా మెదక్, నర్సాపూర్, రామాయంపేట, పెద్దశంకరంపేట, తూప్రాన్, తదితర సెంటర్లలో అత్యధికంగా దుకాణాలు వెలుస్తాయి. దుకాణం ఏర్పాటు చేయాలంటే పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక, మున్సిపాలిటీ విభాగాల అనుమతులు తప్పనిసరి. నిబంధనల ప్రకారం దుకాణాన్ని ఏర్పాటు చేస్తే మాత్రమే అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా నాలుగు శాఖలకు దరఖాస్తులు చేసుకుని అన్నీ సక్రమంగా ఉంటే షాపు అనుమతి కోసం రూ.500 చెల్లించి ఏర్పాటు చేయాలి. కానీ పలువురు నిర్వాహకులు అలాంటి నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా ఏర్పాటు చేస్తున్నారు.

జిల్లా కేంద్రంలో...!

మెదక్ జిల్లాకేంద్రంలోని జూనియర్ కళాశాల మైదానంలో బాణసంచా దుకాణాలను ఇబ్బడి ముబ్బడిగా ఏర్పాటు చేస్తున్నారు. ఈ దుకాణాలు నివాసగృహాలకు దూరంగా ఉండటంతోపాటు దుకాణానికి దుకాణానికి మధ్య కనీసం మూడు మీటర్ల దూరం ఉండాలి. ఈ నిబంధనను కూడా తుంగలోకి తొక్కి ఒకదానికొకటి అంటిపెట్టుకుని దుకాణాలు ఏర్పాటు చేస్తున్నా అధికారులెవరూ కనీసం స్పందించడం లేదు. ఏదైనా ప్రమాదం జరిగితే ప్రాణాలు పోయే పరిస్థితి నెలకొందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలే



బాణసంచా దుకాణాలు నిబంధనలకు లోబడి మాత్రమే ఏర్పాటు చేసుకోవాలి. ఉల్లంఘిస్తే ఆ దుకాణ యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటాం. పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక, మున్సిపల్‌శాఖ అధికారులు షాపులను పరిశీలించాకనే అనుమతులిస్తారు.

– శ్రీనివాస్‌రావు, జిల్లా ఎస్పీ